

మిడ్‌మానేరుకు గోదావరి జలాలు

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరులోకి కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి శనివారం సాయంత్రం వరకు 3,150 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.



మారుమోగిన శివోహం

వేములవాడ: రాజన్నను శనివారం 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. రద్దీని గమనించిన ఆలయ అధికారులు అభిషేకాలు, అన్నపూజల టికెట్లను కట్టడి చేశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 35.0/24.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. తెల్లవారుజామున ఈదురుగాలులు వీస్తాయి.

రంజాన్ వేళలు

తల్లి ఒడిలో ఉన్నప్పటి నుంచి తనువు చాలించే వరకూ విద్య సముపార్జన చేయండి
– మహ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
ఆది 6.34	సోమ 4.37

న్యూస్‌రీల్

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



అఖిల్ మహాజన్ ఎస్పీ

సిరిసిల్లక్రైం: సామాజిక మాధ్యమాలు, సాంకేతిక విధానాలతో జరిగే సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ శనివారం ప్రకటనలో కోరారు. సైబర్ నేరాలకు గురైతే టోల్‌ఫ్రీ నంబర్ 1930, డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు. అధిక లాభాలకు ఆశపడి, సోషల్ మీడియాలో ప్రకటనలు నమ్మి మోసపోవద్దని సూచించారు.

గీతకార్మికుల సంక్షేమమే లక్ష్యం



మాట్లాడుతున్న గోవర్ధన్‌గౌడ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గీత కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు చిదుగు గోవర్ధన్ గౌడ్ పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేటలోని ఫంక్షన్ హాల్‌లో జిల్లా గౌడసంఘం సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. గోవర్ధన్‌గౌడ్ మాట్లాడుతూ మండల సంఘం భవనం నిర్మాణానికి తన సొంత ఖర్చులతో 310 గజాల స్థలం ఇవ్వనున్నట్లు తెలిపారు. కొంత మంది గీతకార్మికులు దుర్భర జీవితాలు గడుపుతున్నారని.. అలాంటి వారికి చేయూతనిస్తానన్నారు. సంఘం మండలాధ్యక్షుడు ముష్కం దత్తాద్రిగౌడ్, నాయకులు కొండ రమేశ్‌గౌడ్, బొల్గం రంగాగౌడ్, కదిరె భాస్కర్‌గౌడ్, బాల్‌రాజు నర్సాగౌడ్, వివిధ గ్రామాల అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

వేగవంతంగా పనులు పూర్తి చేయండి



పనులు పరిశీలిస్తున్న అధికారులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలోని సంఘం చెరువు పనుల్లో వేగం పెంచి నాణ్యత ప్రమాణాలు పాటించాలని నీటిపారుదల శాఖ ఏఈ కృష్ణకాంత్ సూచించారు. చెరువు మరమ్మతు పనులు శనివారం పరిశీలించిన సందర్భంగా మాట్లాడారు. చెరువు కింద 350 ఎకరాల ఆయకట్టు ఉందని, వరదనీరు వృథాగా పోకుండా చెరువు కట్ట మరమ్మతు, తూము పనులు చేపట్టినట్లు తెలిపారు. నిర్మాణ పనులను రైతులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలన్నారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తేవాలని సూచించారు. ఈ పనులను ఎంపీటీసీ ల్యాగల శ్రీనివాస్‌రెడ్డి, మండల కో–ఆప్షన్ సభ్యుడు జబ్బర్ పరిశీలించారు.



ఈ యువకుడు ఈద అశోక్. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం హరిపురం స్వగ్రామం. అమ్మానాన్న స్వరూప– మల్లయ్య. అశోక్ బీకాం, ఎంబీఏ పూర్తిచేశాడు. ఎక్కడా ఉద్యోగ అవకాశం రాకపోవడంతో గ్రామంలోనే అమ్మానాన్నకు తోడుగా వ్యవసాయ పనులు చేశాడు. వివాహమై కూతురు పుట్టింది. కుటుంబ పోషణకు గ్రామంలోనే మిషన్ భగీరథలో పనిలో చేరాడు. రూ.13వేల జీతం ఇచ్చేవారు. అవీ ఎప్పుడో వచ్చేవి. కుటుంబ పోషణ కష్టమైంది. ఉద్యోగాల కోసం కంపెనీల వెంట తిరగడం కన్నా రెక్కలకష్టాన్ని నమ్ముకుందామని అనుకున్నాడు. రెండేళ్లక్రితం కరీంనగర్ రైల్వేస్టేషన్‌లో హమాలీగా చేరాడు. వచ్చే ఆదాయంతో కరీంనగర్‌లో అద్దెకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. 'ఈ రోజుల్లో ఎంత చదివామన్నది ముఖ్యం కాదు. ఏం పనిచేశామన్నది ముఖ్యం. ఉద్యోగమే జీవితం కాదు. కష్టపడితే ఫలితం అదే ఉంటుంది' అని అశోక్ చెబుతున్నాడు.



ఈయన చిలుకూరి తిరుపతి. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల పరిధిలోని యాదవులపల్లె. అమ్మానాన్న మల్లయ్య– ఎల్లవ్వ. ఉన్న ఎకరం వ్యవసాయభూమిని సాగు చేస్తుంటారు. తిరుపతి 2018లో ఎంబీఏ పూర్తి చేశాడు. తరువాత పలు ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేశాడు. ప్రక్రియ ఆలస్యమవడం, తదితర కారణాలతో ఆ ఆలోచన పక్కనపెట్టాడు. కరీంనగర్‌లోని ట్రాన్స్‌పోర్టులో చేరాడు. ఇంతలో వివాహమైంది. కూతురు పుట్టింది. కుటుంబ పోషణకు వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో ఏడాదిక్రితం రైల్వేలో హమాలీగా చేరాడు. 'హమాలీగా నాకు బస్తాలు మోయడం కొత్త. అయినా ఇష్టంగా మోస్తున్నా. అవకాశాల కోసం ఎదురు చూడడం కన్నా.. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే జీవితంలో సంతోషంగా బతుకుతాం' అంటూ చెప్పాడు తిరుపతి.

సండే స్పెషల్

గ్రాడ్యుయేట్ హమాలీలు



- హమాలీగా ఆసక్తి చూపుతున్న ఉమ్మడి జిల్లా యువత
- ఉద్యోగాలకోసం ఎదురుచూడకుండా స్వయంకృషి వైపు అడుగులు
- సొంతపనిలో సంతోషం ఉందంటున్న 'లోకల్ బాహుబలి'లు

రక్తాన్ని స్వేదంగా చిందిస్తే కానీ వారి కుటుంబాలకు బుక్కెడు బువ్వ దొరకదు. వందల బస్తాల బరువు మోస్తే కానీ రోజు గడవదు. పొద్దున్నే లేవడం సద్దన్నం తినడం.. ఓ చేతిలో తువాల.. మరోచేతిలో టిఫిన్‌బాక్స్‌తో బయల్దేరి రావడం.. పొద్దంతా ఒళ్లువంచి పనిచేయడం వీరి నిత్యకృత్యం. చేతిలో డిగ్రీ, పీజీ పట్టాలున్నా.. కార్పొరేట్ కంపెనీల చుట్టూ తిరగకుండా.. సర్కారు కొలువే కావాలని ఎదురుచూడకుండా అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ.. శ్రమను ఆయుధంగా మలుచుకుని జీవితంలో సక్సెస్ అవుతున్నారు రైల్వే హమాలీలు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని రైల్వేస్టేషన్లలో పనిచేసే హమాలీ కార్మికుల్లో గ్రాడ్యుయేట్లు.. పోస్టు గ్రాడ్యుయేట్లు.. వారి శ్రమైక జీవనంపై సండే స్పెషల్..
– సాక్షి, కరీంనగర్ డెస్క్

ఎక్కువగా యువతే..

హమాలీ పని అంటే రోజంతా బస్తాలు మోయాలి. పొద్దంతా కష్టపడితే.. రాత్రంతా ఒళ్లునొప్పులతో బాధపడుతుంటారు చాలామంది. కొన్నాళ్ల క్రితం 30ఏళ్ల పైబడిన వారే హమాలీ కార్మికులుగా పనిచేసేవాళ్లు. ఏదో తప్పనిసరి పరిస్థితుల్లో ఈ పనికి వచ్చామని చెప్పుకొచ్చేవారు. ఇప్పుడు కాలం మారింది. ఏసీల్లో కూర్చుని కార్పొరేట్ ఉద్యోగం చేయాలనే ఆలోచన నుంచి పనిఏదైనా సంపాదన ముఖ్యం అనే ఆలోచన యువతలో పెరుగుతోంది. రైల్వేశాఖలో పనిచేసే హమాలీ కార్మికుల్లో ఎక్కువగా యువతే కనిపిస్తోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని రామగుండం, పెద్దపల్లి, సుల్తానాబాద్, కరీంనగర్, జగిత్యాల, తదితర ప్రాంతాల్లోని రైల్వేస్టేషన్లలో గూడ్స్‌వ్యాగన్ల నుంచి సరుకులు ఎగుమతి, దిగుమతి చేసే హమాలీల్లో 70శాతం మంది యువతే ఉంటున్నారు. ఇందులోనూ సగంమంది వరకు గ్రాడ్యుయేట్లు, పోస్టు గాడ్యుయేట్లు పనిచేస్తున్నారు.

కరీంనగర్‌లో అధికంగా..

కరీంనగర్ జిల్లాకేంద్రంలో ఉన్న రైల్వేస్టేషన్‌లోని హమాలీల్లో ఎక్కువగా యువతే పనిచేస్తున్నారు. రైల్వేస్టేషన్ పరిధిలో 226 మంది వరకు హమాలీలు ఉండగా.. ఎనిమిది బ్యాచ్‌ల చొప్పున పనిచేస్తున్నారు. ఇందులో 150 మంది వరకు యువతే ఉన్నారు. ఇందులోనూ 60మంది వరకు డిగ్రీలు, పీజీలు చేసినవారే. పెద్దపల్లిలో 100 మంది హమాలీల్లో 30మంది, సుల్తానాబాద్‌లో 50మందిలో 15, జగిత్యాలలో 60మందిలో 10మంది, రామగుండంలో 50మంది వరకు హమాలీలు పట్టభద్రులే. వీరిలోనూ 22 ఏళ్ల నుంచి 35 ఏళ్ల మధ్య ఉన్నవారే అధికంగా ఉన్నారు. డిగ్రీలు, పీజీలు చేసిన తరువాత సమయం వృథా చేయడం, ఉద్యోగాల కోసం కంపెనీల చుట్టూ తిరగడం, ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎదురుచూడడం కన్నా కష్టమైనా ఇష్టంగా పనిచేస్తున్నామని, సొంతంగా పనిచేయడంలో ఆత్మసంతృప్తి, ఆరోగ్యంతో పాటు ఆనందం ఉందని పలువురు యువ బాహుబలిలు చెబుతున్నారు.

ఏడాదిలో తొమ్మిది నెలలు..

రైల్వేస్టేషన్లలో పనిచేసే హమాలీలు ఏడాదిలో దాదాపు తొమ్మిది నెలల పాటు విరామం లేకుండా కష్టపడుతుంటారు. పొద్దున్నే ఎనిమిది గంటల వరకు స్టేషన్‌కు చేరుకోవాలి. అక్కడ హాజరు పట్టికలో పేర్ల నమోదు తరువాత సరుకు ఎగుమతి, దిగుమతి చేస్తుంటారు. బియ్యం, ఎరువులు, గ్రానైట్, సిమెంట్, తదతర సరుకులు లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తుంటారు. బయట ఉద్యోగాల కన్నా.. హమాలీ పని చేయడం ద్వారా వచ్చే ఆదాయంలో కుటుంబాన్ని సంతోషంగా పోషించుకుంటున్నామని పలువురు యువ గ్రాడ్యుయేట్ హమాలీలు పేర్కొంటున్నారు.

ప్రభుత్వ కొలువుకూ ప్రయత్నిస్తున్నా



మాది ఎలిగేడు మండలం ర్యాకల్‌దేవ్‌పల్లి. అమ్మానాన్న కొమురయ్య– లక్ష్మి. చెల్లి, తమ్ముడు ఉన్నారు. మాకున్న నాలుగు ఎకరాల భూమిని నాన్న సాగు చేస్తుంటాడు. 2014లో బీకాం కంప్యూటర్స్ పూర్తయ్యింది. ఎంబీఏ మధ్యలో ఆపివేశా. కరీంనగర్‌లో ఉంటూ కానిస్టేబుల్ కోచింగ్‌కు వెళ్లాను. రాత పరీక్షలో 1.5 మార్కులతో ఉద్యోగాన్ని మిస్సయ్యాను. ఇంట్లో ఖాళీగా ఉంటున్నానని తెలిసినవాళ్లు కరీంనగర్‌లోని రైల్వేలో హమాలీగా పని ఇప్పించారు. కొత్తలో కాస్త కష్టమనిపించింది. డిగ్రీ చదివిన నేను హమాలీ చేయడం ఏంటని ఇబ్బంది పడ్డా. తరువాత పనికాదు ముఖ్యం.. పట్టుదల అనిపించింది. హమాలీ పని అలవాటైంది. మూడేళ్లుగా ఇక్కడే చేస్తున్నా. ఇటీవలే వివాహమైంది. ఈ పని చేసుకుంటూనే మళ్లీ పోలీసు ఉద్యోగానికి సన్నద్ధం అవుతున్నా. ఈవెంట్స్ సాధించాను. పొద్దంతా హమాలీ.. ఇంటికెళ్లాక పుస్తకాలతో కుస్తీ పడుతున్నా.
– మాదరవేని అశోక్, రైల్వే హమాలీ, ర్యాకల్‌దేవ్‌పల్లి

నాన్న పని నేను చేస్తున్నా



మాది రామగుడు మండలం ఒన్నారం. అమ్మానాన్న సత్తవ్వ– కనుకయ్య. నేను బీఎస్సీ(స్టాటస్టిక్స్) 2020లో పూర్తిచేశా. తరువాత మాకు ఉన్న మూడు ఎకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ అమ్మానాన్నకు తోడుగా ఉన్నా. పలు ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రయత్నం చేశా.. రాలేదు. సమయం వృథా చేయవద్దు అనుకున్నా. నాన్న కరీంనగర్ రైల్వే స్టేషన్‌లో హమాలీ పని చేసేవాడు. ఇప్పుడు నాన్నకు చేతనైతలేదు. ఇక ఆయన బాధ్యత నేను తీసుకున్నా. ఏడాదిన్నరగా రైల్వేలో హమాలీగా పనిచేస్తున్నా. కొత్తలో కష్టమనిపించింది. ఇప్పుడు అలవాటైంది.
– సతీశ్, రైల్వే హమాలీ, ఒన్నారం

దుబాయ్ పోయి వచ్చిన



మాది మానకొండూర్ మండలం ఖాదర్‌గూడెం. అమ్మానాన్న అరుణ– రమేశ్. మాకు రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. నేను బీకాం పూర్తిచేశా. డిగ్రీ అయిన వెంటనే దుబాయ్ వెళ్లాను. అక్కడ చెఫ్‌గా పనిచేశాను. కరోనా టైంలో అక్కడ ఉండలేని పరిస్థితి. ఇంటికొచ్చాక ప్రయివేటుగా ఉద్యోగం దొరకని దుస్థితి. అప్పటికే మా నాన్న రైల్వేలో హమాలీగా పనిచేస్తున్నారు. 40ఏళ్లుగా ఒక్కడే బస్తాలు మోస్తూ మమ్మల్ని పోషించారు. ఇక ఆయన్ను కష్టపెట్టవద్దు అనుకున్నా. ఆయన బాధ్యతలు నేను తీసుకున్నా. ఏడాదిన్నర హమాలీగా పని చేస్తున్నా. కొత్తలో ఇబ్బందిగా ఉన్నా.. తోటి కార్మికులు తోడుగా నిలిచారు. ఇటీవలే వివాహమైంది. కూలీగా చేస్తున్నా.. కుటుంబాన్ని సంతోషంగా ఉంచుతున్నా.
– జంగ శ్రీకాంత్, రైల్వే హమాలీ, ఖాదర్‌గూడెం

మతసామరస్యానికి ప్రతీక వేములవాడ

- ఎమ్మెల్యే రమేశ్‌బాబు



రన్ ఫర్ జీసస్ ర్యాలీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

వేములవాడ/వేములవాడరూరల్: మన వేములవాడ మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందని ఎమ్మెల్యే రమేశ్‌బాబు పేర్కొన్నారు. వేములవాడలో శనివారం నిర్వహించిన రన్ ఫర్ జీసస్‌లో పాల్గొని మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాజన్న ఆలయంలో దర్గా ఉందని.. రాజన్నతోపాటు దర్గాను హిందువులు, ముస్లింలు దర్శించుకునే సాంప్రదాయం ఇక్కడి ప్రత్యేకత అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి మాట్లాడుతూ పండుగలు సంతోషాన్ని ఇస్తాయన్నారు. ఎస్సైలు రఫీక్‌ఖాన్, వెంకట్రాజం బందోబస్తు నిర్వహించారు.

రమేశ్‌బాబును కలిసిన చాడ

సీపీఐ జాతీయ కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి ఎమ్మెల్యే రమేశ్‌బాబును వేములవాడలోని నివాసంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చించారు. ఈసందర్భంగా సీహెచ్.రాజేశ్వర్‌రావుతో కలిసి పనిచేసిన అనుభవాలను చాడ గుర్తు చేసుకున్నారు.

కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు

పార్టీలో కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే రమేశ్‌బాబు పేర్కొన్నారు. వేములవాడరూరల్ మండలం చెక్కపల్లిలో శనివారం నిర్వహించిన బీఆర్‌ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. మెట్టప్రాంతమైన వేములవాడ నియోజకవర్గంలోని 55 వేల ఎకరాలను ఎల్లంపల్లి ప్రాజెక్టుతో సస్యశ్యామలం చేస్తున్నట్లు తెలిపారు. వేములవాడ రూరల్ మండలానికి రూ.340కోట్లతో ఇప్పటికే పలు అభివృద్ధి పనులు చేసినట్లు చెప్పారు. అనంతరం పార్టీ జిల్లా పరిశీలకుడు బస్వరాజు సారయ్య మాట్లాడుతూ కార్యకర్తలు కలిసికట్టుగా కష్టపడి మళ్లీ కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా చూడాలని కోరారు. జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, పవర్‌లూమ్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఏశ వాణి, పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి, మండలాధ్యక్షుడు గొస్కుల రవి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఏశ తిరుపతి, సెస్ డైరెక్టర్ ఆకుల దేవరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ గడ్డం హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరామాయణ మహాయాగం



గంభీరావుపేట మండలం భీమునిమల్లారెడ్డిపేట శ్రీవీరాంజనేయ స్వామి క్షేత్రంలో శ్రీరామకోటి జప సహిత పురశ్చరణ పూర్వక శ్రీరామాయణ మహాయాగం ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం మన్యుసూక్త హవనం, సంపూర్ణ రామాయణ హవనం, పురశ్చరణ హోమాలు నిర్వహించారు. భక్తులందరూ సామూహికంగా రామకోటి జపం చేశారు.
– గంభీరావుపేట(సిరిసిల్ల)

యశోద హాస్పిటల్స్
యశోద మెడికల్ సెంటర్
3-1-397/ఎ, హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్ ప్రక్కన, అంబేడ్కర్ రోడ్, కరీంనగర్
సూపర్ స్పెషాలిటీ వైద్యనిపుణులు మీ చేరువలో

ప్రత్యేకతలు	వైద్యులు	తేది
మెదడు, వెన్నెముక వ్యాధులు : తలనొప్పి, పక్షవాతం, మూర్ఛవ్యాధి, పార్కిన్సన్స్, వెన్ను మరియు మెడనొప్పి, చేతులు, కాళ్ళ తిమ్మిర్లు, నరాల బలహీనత	డా॥ మోహన్ కృష్ణ బొన్నలగడ్డ	11-04-2023 మంగళవారం
కిడ్నీ వ్యాధులు : కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్, రోబోటిక్ సర్జరీ, రీకన్‌స్ట్రక్టివ్ యూరాలజీ, ల్యాప్రోస్కోపిక్ యూరాలజీ, ఆండ్రాలజీ & మేల్ ఇన్‌ఫెర్టిలిటీ, మేల్ ఇన్‌ఫెర్టిలిటీ, ఫిమేల్ యూరాలజీ	డా॥ దుర్గ ప్రసాద్ బి	
కార్డియాలజీ వ్యాధులు : పుట్టుకతో వచ్చే గుండెజబ్బులు, హార్ట్ ఎటాక్, అధిక రక్తపోటు, గుండె దడ, ఆయాసం, ఇతర అన్ని రకముల గుండె జబ్బులు కలవారు	డా॥ బి. కార్తీక్ బాబు	
న్యూరో & ఇంటర్వేన్షనల్ రేడియాలజీ వ్యాధులు : మెదడులో రక్తనాళాలు బ్లాక్, రక్తనాళాలు మెలిక పడటం, కాన్పు తరువాత గర్భాశయంలో అధిక రక్తస్రావం, దగ్గినప్పుడు రక్తం పడటం, డయాలసిస్ ఫిస్టులా బ్లాక్	డా॥ సురేష్ గిరగాని	12-04-2023 బుధవారం
కిడ్నీ వ్యాధులు : మూత్రపిండాలలో రాళ్ళు, మంట, మూత్ర విసర్జనలో సమస్యలు, అధిక రక్తపోటు, షుగర్ వ్యాధిగ్రస్తులలో మూత్రపిండాల సమస్యలు	డా॥ రాజశేఖర చక్రవర్తి ఎమ్	
కార్డియాలజీ వ్యాధులు : పుట్టుకతో వచ్చే గుండె జబ్బులు, హార్ట్ ఎటాక్, అధిక రక్తపోటు, గుండె దడ, ఆయాసం, ఇతరల అన్ని రకముల గుండె జబ్బులు కలవారు	డా॥ ఎ. గురు ప్రకాష్	13-04-2023 గురువారం
అంకాలజీ కన్సల్టేషన్ : రొమ్ము క్యాన్సర్, తల, స్త్రీ జననేంద్రియ క్యాన్సర్లు, మెడ క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్, ఎముక మృదు కణజాల క్యాన్సర్	డా॥ హరీష్ కంచెర్ల	
కార్డియో థొరాసిక్ సర్జరీ కన్సల్టేషన్ : ఊపిరి ఆడకపోవడం, ఛాతిలో నొప్పి (ఆయాసం), గుండె త్వరగా కొట్టు కోవడం, శస్త్రచికిత్స తీసుకోవడంపై రెండవ అభిప్రాయం, బీపో & అయోర్టిక్ సహా కాంప్లెక్స్ కార్డియాక్ సర్జరీస్, ఎం.ఐ.సి.ఎస్. (మినిమల్లీ ఇన్వాసివ్ కార్డియాక్ సర్జరీలు), సర్జరీస్ ఫర్ హార్ట్ ఫెయిల్యూర్	డా॥ విక్రమ్ రెడ్డి	14-04-2023 శుక్రవారం
రేడియేషన్ అంకాలజీ కన్సల్టేషన్ : మానని పుండ్లు, రొమ్ములో కణుతులు, గర్భసంచి క్యాన్సర్, థైరాయిడ్ క్యాన్సర్, జీర్ణకోశ క్యాన్సర్, రెక్టమ్ క్యాన్సర్, నోటి క్యాన్సర్, గొంతు క్యాన్సర్ మరియు ప్రోస్టేట్ క్యాన్సర్	డా॥ మహమ్మద్ అబ్దుల్ అజీమ్	15-04-2023 శనివారం

అపాయింట్‌మెంట్ కొరకు: 915 424 6125

వ్యవసాయ కళాశాల సిద్ధం

- 12న ప్రారంభించనున్న మంత్రులు కేటీఆర్, నిరంజన్‌రెడ్డి
- 35 ఎకరాలలో రూ.69.30 కోట్లతో ఏర్పాటు
- పరిశీలించిన కలెక్టర్ అనురాగ్ జయంతి



వ్యవసాయ కళాశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండలంలోని జిల్లెల్ల గ్రామ శివారులో ఏర్పాటు చేసిన వ్యవసాయ కళాశాల ప్రారంభానికి సిద్ధమైంది. పనులు దాదాపు పూర్తయ్యాయి. ఈనెల 12న మంత్రులు కేటీఆర్, నిరంజన్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభించనున్నారు. కళాశాలలో ఏర్పాటు చేస్తున్న పనులను కలెక్టర్ అనురాగ్ జయంతి శనివారం పరిశీలించారు. కళాశాల వైస్‌చాన్స్‌లర్ రఘునందన్‌రావు, రిజిస్ట్రార్ డాక్టర్ సుధీర్‌బాబు, డీన్ డాక్టర్ సీమ ఉన్నారు.

35 ఎకరాల్లో ఏర్పాటు

జిల్లెల్ల వ్యవసాయ కాలేజీని 35 ఎకరాలలో రూ.69.30 కోట్లతో ఏర్పాటు చేశారు. 16 ఎకరాల విస్తీర్ణంలో కాలేజీ భవనం, విద్యార్థులకు వేర్వేరు హాస్టళ్లు, 19 ఎకరాల్లో పరిశోధన క్షేత్రంతోపాటు ఫామ్‌లాండ్స్ ఏర్పాటు చేశారు. అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్, ప్రయోగశాల, సెమినార్ హాల్స్, అధ్యాపకుల గదులు, అసోసియేట్ డీన్ చాంబర్, ఆధునిక లైబ్రరీని నిర్మించారు.

కిశోర్ మృతి కేసులో 8 మంది అరెస్టు

- డీఎస్పీ నాగేంద్రాచారి



కిశోర్ మృతికి కారకులైన 8 మందిని అరెస్టు చూపిస్తున్న డీఎస్పీ

వేములవాడ: కోనరావుపేట మండలం మరిమడ్ల అటవీ ప్రాంతంలో భూక్యారెడ్డి తండాకు చెందిన భూక్య కిశోర్ మృతి సంఘటనలో 8 మందిని అరెస్టు చేసినట్లు వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. వేములవాడలోని డీఎస్పీ ఆఫీస్‌లో శనివారం వివరాలు వెల్లడించారు. చందుర్తి మండలం బండపల్లికి చెందిన వడ్డెర కులస్తులు అటవీ జంతువులను వేటాడి, వాటి మాంసాన్ని విక్రయిస్తున్నారు. ఈక్రమంలో ఈనెల 6న మరిమడ్ల ఫారెస్ట్ ప్రాంతంలో అటవీ జంతువులను వేటాడేందుకు విద్యుత్ తీగను అమర్చారు. అదే రోజు రాత్రి భూక్య కిశోర్ గమనించకుండా పొలానికి వెళ్తుండగా విద్యుత్ తీగలు తగలడంతో మరణించారు. ఈ సంఘటనకు కారకులైన బండపల్లికి చెందిన వేముల ఇసాక్, పల్లపు రాజయ్య, పల్లపు దేవరాజు, గోగుల వెంకటేశం, వేముల సురేశ్, పల్లపు సురేశ్, వీరికి సహకరించిన మరిమడ్లకు చెందిన లోకుర్తి శ్రీనివాస్, పల్లపు వెంకటకృష్ణయ్యలను అరెస్టు చేసినట్లు చెప్పారు. వీరి నుంచి మూడు బైక్‌లు, 8 సెల్‌ఫోన్లు, విద్యుత్ సరఫరాకు ఉపయోగించిన వైర్‌ను సీజ్ చేసినట్లు చెప్పారు. భవిష్యత్‌లో ఇలాంటి పనులకు ఎవరైన ఒడిగట్టితే పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. సీఐ కిరణ్‌కుమార్, ఎస్సై రఫీక్ ఖాన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముగిసిన రాములోరి బ్రహ్మోత్సవాలు



సప్త వర్ణాల కార్యక్రమం జరుపుతున్న వేదపండితులు

గంభీరావుపేట(సిరిసిల్ల): మండల కేంద్రంలోని శ్రీసీతారామస్వామి దేవస్థానంలో పది రోజులుగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు శనివారం ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు శేష హోమం, మహా పూర్ణాహుతి, ద్వాదశారాధన, బలిహరణం, దేవతా ఉద్వాసనం, ధ్వజారోహణం, సప్త వర్ణాలు, ఏకాంత సేవ తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

ఎల్లంపల్లి పైపులైన్‌కు మరమ్మతు చేయాలి



ఆందోళన చేస్తున్న నాయకులు, రైతులు

చందుర్తి(వేములవాడ): మండలంలోని లింగంపేట శివారులోని ఎల్లంపల్లి పైపులైన్‌కు మరమ్మతు చేపట్టాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ రుద్రంగి గ్రామాధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఆందోళన చేపట్టారు. గత వర్షాకాలంలో కురిసిన వర్షాలకు పైపులైన్ కొట్టుకుపోయిందని.. అప్పటి నుంచి పట్టించుకునే వారు లేరన్నారు. సుమంత్ రాజిరెడ్డి, పొద్దుపొడుపు గంగారెడ్డి, సామ సంతోష్‌రెడ్డి, భూమారెడ్డి పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య ఘటనలో నలుగురిపై కేసు

గంభీరావుపేట(సిరిసిల్ల): ముచ్చర్ల తండాకు చెందిన భూక్య అజయ్ అనే యువకుడు మలేషియాలో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. అజయ్ గతేడాది సరిత అనే యువతిని ప్రేమించి, పెళ్లి చేసుకున్నాడు. ఇటీవల బతుకుదెరువు నిమిత్తం మలేషియా వెళ్లాడు. సరిత కానిస్టేబుల్ ఉద్యోగానికి కోచింగ్ కోసం సిద్దిపేట వెళ్లింది. ఈ క్రమంలో పది రోజుల క్రితం అజయ్ ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే తన కుమారుడి చావుకు అతని భార్య సరిత, ఆమె తల్లిదండ్రులు, ముచ్చర్ల తండాకే చెందిన రమేశ్ కారణమని మృతుడి తల్లి భూక్య రేణ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నలుగురు నిందితులపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆస్తి పన్ను రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

సిరిసిల్లఅర్బన్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2023–24కి ఇంటిపన్ను ముందస్తుగా చెల్లించి ప్రభుత్వం అందించే రాయితీని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30వ తేదీలోపు ఆస్తిపన్ను చెల్లించిన వారికి ప్రభుత్వం ఐదు శాతం రాయితీ కల్పిస్తుందని పేర్కొన్నారు. ఆస్తి, నల్లాబిల్లులు సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు.

వసూళ్లు.. వందశాతం



సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయ భవనం



పన్ను వసూలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, సిబ్బంది

- సిరిసిల్ల మున్సిపల్‌కు ప్రజల పన్ను దన్ను
- పన్ను వసూళ్లలో నంబర్‌వన్
- ఫలించిన మంత్రి కేటీఆర్ మార్గదర్శకం

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల పురపాలనలో జాతీయ, రాష్ట్రస్థాయిలో పేరొందుతోంది. ప్రైవేటు ఆస్తుల పన్నుల విషయంలో మూడేళ్లుగా పురపాలకసంఘం ఆదర్శంగా నిలుస్తోంది. నూరుశాతం వసూలు చేస్తూ రాష్ట్రస్థాయిలో ముందుంటోంది. సిరిసిల్ల పట్టణంలో 22,424 నివాసగృహాలు ఉన్నాయి. వీటికి సంబంధించిన ఆస్తి పన్నులను అధికారులు రెండు నెలలుగా వసూలు చేస్తున్నారు. నూరుశాతం వసూళ్లే లక్ష్యంగా ఇంటింటా తిరిగి లక్ష్యాన్ని ఛేదించారు. రోజులో డ్యూటీ గంటలు మించి పనిచేసి రెవెన్యూ వసూళ్లలో రాష్ట్రవ్యాప్తంగా నంబర్‌వన్ స్థానంలో నిలిచేలా సహకరించారు. పన్నుల వసూళ్లలో ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ విధానం సంస్థకు మరింత లాభం చేకూరింది. మున్సిపల్ పరిధిలో పన్నులు రూ.4.42కోట్ల డిమాండ్ ఉండగా సుమారు రూ.4.41కోట్లు వసూలు అయ్యాయి. గతేడాది రూ3.98కోట్లు డిమాండ్ ఉండగా రూ.3.96 అనగా 99.47శాతం బకాయిలు వసూలవడం గమనార్హం.

పెరిగిన ఆదాయ వనరులు

దినదినం విస్తరిస్తున్న సిరిసిల్ల పట్టణం అభివృద్ధికి గాను బల్దియా కొత్తగా ఆదాయ వనరులు సాధించడంలో సఫలమైంది. పరిశుభ్ర పట్టణంగా కీర్తిపొందిన సిరిసిల్ల వీధుల్లో చెత్తవేసిన వారికి పెనాల్టీలు విధించడం, ప్లాస్టిక్ నిషేధాన్ని పూర్తిగా అమలు చేస్తూ ఉల్లంఘనులకు జరిమానాలు విధించడం, ప్రతీ దుకాణం నుంచి తడి, పొడి చెత్త సేకరించేందుకు విధిగా ఒక్కోదుకాణదారుడి నుంచి రూ.300వరకు యూజర్ చార్జీలు వసూలు చేస్తున్నారు. రోడ్డుపై టేలాలు వేయడం, వ్యాపారాలు చేయడం, ఫుట్‌పాత్‌లు ఆక్రమించడం తదితర అంశాలపై కూడా నిత్యం దాడులు చేస్తూ ఆదాయం పెంచారు. ఇక పన్నులు కట్టేవారి పేర్లు రికార్డుల్లో తప్పులుంటే వెంటనే సవరించడం, ఇతర ఇబ్బందులపై ఫిర్యాదు అందిన వెంటనే సమస్యను పరిష్కరించడం వంటి అంశాలు కలిసి వచ్చాయి.

హ్యాట్రిక్ దిశగా..

గడిచిన రెండేళ్లుగా రాష్ట్రంలో అత్యధిక పన్నులు వసూలు చేస్తున్న పట్టణాల్లో సిరిసిల్ల నంబర్ వన్ స్థానంలో నిలుస్తోంది. ఈ ఏడాది కూడా అదే పరంపర కొనసాగడంతో హ్యాట్రిక్ కొట్టేయనుందని అధికారులు, ప్రజాప్రతినిధులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇక రెండు నెలల నుంచి పన్నుల వసూళ్ల కోసం 51మంది సిబ్బంది 39వార్డుల్లో 15 గ్రూపులుగా ఏర్పడి నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో కష్టపడ్డారు. ఈ ఏడాదికి మున్సిపాలిటీకి రావాల్సిన పన్నులు రూ.4.42కోట్లు కాగా.. ప్రతీ వార్డుకు ఒక ఆఫీసర్, ఐదు వార్డులకు కలిపి ప్రత్యేక అధికారి, ప్రతి పదివార్డులకు ఒక నోడల్ ఆఫీసర్ చొప్పున మున్సిపల్ సిబ్బంది కమిషనర్ వెల్దండి సమ్మయ్య పర్యవేక్షణలో పన్నులు వసూలు చేశారు.

పరస్పర సహకారంతో....



కౌన్సిలర్లు, సిబ్బంది పరస్పర సహకారంతో పూర్తిస్థాయిలో పన్నులు వసూలు అవుతున్నాయి. పట్టణంలో మున్సిపల్‌కు రావాల్సిన ఆస్తి పన్నులు ప్రణాళికాబద్ధంగా వసూలు చేయడం జరిగింది. కేవలం 17నివాసాలు అందులో మూడు మొండి బకాయి, మరో పది నివాసాలు బ్యాంకు సీజ్‌లో ఉండగా.. మిగిలిన నలుగురు మాత్రమే పన్నులు కట్టలేని స్థితిలో ఉన్నారు. వెల్దండి సమ్మయ్య, మున్సిపల్ కమిషనర్, సిరిసిల్ల

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న చల్మెడ లక్ష్మీనర్సింహారావు

కోనరావుపేట(వేములవాడ): గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించాలన్న ఉద్దేశంతో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చల్మెడ వైద్య విజ్ఞాన సంస్థ చైర్మన్ చల్మెడ లక్ష్మీనర్సింహారావు తెలిపారు. కోనరావుపేట మండలంలోని నిమ్మపల్లిలో శనివారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. ఈ రోజుల్లో ఎక్కువ మంది కేన్సర్ బారిన పడుతున్నారని తెలిపారు. దీన్ని తొలి దశలో గుర్తిస్తేనే చికిత్స సాధ్యమవుతుందని, ముదిరిన తర్వాత ఏమీ చేయలేమన్నారు. కాబట్టి ఇటువంటి శిబిరాల్లో స్క్రీనింగ్ పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని చెప్పారు. తరచూ బీపీ, షుగర్ పరీక్షలూ చేయించుకోవాలన్నారు. వైద్య శిబిరాల్లో వ్యాధి నిర్ధారణ అయిన వారికి కరీంనగర్‌లోని తమ ఆసుపత్రిలో ఉచితంగా నాణ్యమైన వైద్యసేవలు, ఆపరేషన్లు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కదిరె శ్రీనివాస్, ఉపసర్పంచ్ దొంతరవేణి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ బండ సత్తయ్య, నాయకులు చేపూరి గంగాధర్, మానుక సత్యం, పారెల్లి రాజు, మానుక రాజు, జీవన్, ఆరె మహేందర్, వైద్యులు పాల్గొన్నారు.

ప్రైవేటు డ్రైవర్లకు అండగా కాంగ్రెస్

- కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి
- ప్రైవేటు డ్రైవర్లకు పాలసీకార్డులు పంపిణీ



డ్రైవర్లకు పాలసీ కార్డులు అందిస్తున్న కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్లటౌన్: రాష్ట్రంలోని ప్రైవేటు డ్రైవర్లకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం అండగా ఉండి వారి సంక్షేమానికి పాటుపడుతుందని ఆ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సిరిసిల్లలోని రేణుక ఎల్లమ్మ ఫంక్షన్‌హాల్‌లో శనివారం తెలంగాణ సేవా టాక్సీ ఆల్ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 1500 మంది ప్రైవేట్ డ్రైవర్లకు పాలసీకార్డుల అందజేశారు. కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్న డ్రైవర్ల సంక్షేమానికి పథకాలు అమలు చేయాలని కోరారు. పీసీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగుల సత్యనారాయణగౌడ్, జాలుగం ప్రవీణ్, అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గాలి అనిల్‌కుమార్, అధ్యక్షుడు పింగళి సంపత్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగపురి సంతోష్‌కుమార్‌గౌడ్, తాటికొండ రమేశ్, చీల గణపతిరెడ్డి, కలిదిండి దుర్గాప్రసాద్, దాసరి దశరథం, శంకర్, సుధాకర్ పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతులు వేసవిలోనే చేపట్టాలి



మాట్లాడుతున్న కృష్ణప్రసాద్ గౌడ్

గంభీరావుపేట(సిరిసిల్ల): ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వేసవి సెలవుల్లోనే చేపట్టాలని టీఆర్‌టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బుర్ర కృష్ణప్రసాద్ గౌడ్ డిమాండ్ చేశారు. గంభీరావుపేట మండలశాఖ సర్వసభ్య సమావేశం అధ్యక్షులు నాగరాజు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కృష్ణప్రసాద్‌గౌడ్ మాట్లాడుతూ.. ఏళ్లుగా బదిలీలు, పదోన్నతులు లేకపోవడం, ఖాళీలు భర్తీ చేయకపోవడంతో విద్యారంగం సంక్షోభంలోకి వెళ్లిందన్నారు. రెగ్యులర్ ఎంఈవోలు, డిప్యూటీ ఈవోలు, డీఈవోలు లేక ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని పేర్కొన్నారు. ప్రాథమిక విద్య బలోపేతం కావాలంటే ప్రభుత్వం ప్రతీ పాఠశాలకు ఒక ప్రధానోపాధ్యాయుడిని, తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని, స్కూళ్లలో పరిశుభ్రత కోసం స్కావెంజర్లను, అటెండర్ల నియామకం చేపట్టాలని కోరారు. సమావేశంలో జిల్లా కౌన్సిలర్లు బాలకిషన్, రామచంద్రం, గంధ్యాడపు శ్రీనివాస్, నాయకులు శనిగరం మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరిపై డ్రంకెన్‌డ్రైవ్



వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాగట్లపల్లి గ్రామం వద్ద శనివారం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఇద్దరిపై డ్రంకెన్‌డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై శేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నంబర్‌ప్లేట్ లేని వాహనాలపై ప్రయాణం చేయడం నేరమన్నారు.

సిరిసిల్లలో రాచరికపు పాలన

- కేసులు పెడతామంటే బెదరం
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్

సిరిసిల్లటౌన్: రాజన్న సిరిసిల్ల జిల్లాలో రాచరికపు పాలన సాగుతోందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. సిరిసిల్లలోని అంబేద్కర్‌నగర్‌లో శనివారం పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం సాయంత్రం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. 2017లో అక్రమ ఇసుక రవాణాను అడ్డుకునే క్రమంలో జరిగిన పోరాటంలో నేరెళ్లకు చెందిన బహుజనులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి వారిని చావుకు దగ్గరగా తీసుకెళ్లిన విషయం ప్రజలు మరిచిపోలేదన్నారు. జిల్లాలో అంబేద్కర్ విగ్రహాలను మంత్రి కేటీఆర్ మాత్రమే ఆవిష్కరించేలా ఆ పార్టీ నేతలు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంలో బీఆర్ఎస్ నాయకులు, తమ పార్టీ నేతలను బెదిరించారని, కేసులు పెడతామని హెచ్చరిస్తున్నారని.. ఇలాంటి వాటికి తాము భయపడబోమని స్పష్టం చేశారు. అవినీతిలో కూరుకున్న బీఆర్ఎస్ పార్టీకి అధికారంలో కొనసాగే అర్హత లేదన్నారు. అంకని భాను, ఎనగనందుల వెంకన్న, వర్ధవెల్లి స్వామిగౌడ్, లింగంపల్లి మధుకర్, దూడపాక నరేశ్ పాల్గొన్నారు.



ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్‌తో వైఎస్సార్‌టీపీ అధ్యక్షుడు చొక్కాల రాము

ప్రగతిభవన్ కరెంట్ కట్ చేస్తాం..

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రజలకు జరిగిన మేలు కంటే పాలకులకే ఎక్కువ మేలు జరిగిందని ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. తంగళ్లపల్లి మండలంలోని ఓబులాపూర్, రాళ్లపేటల్లో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతుండగా కరెంట్ తీసివేయడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. ప్రగతిభవన్ కరెంట్ కట్ చేస్తామని హెచ్చరించారు. సర్పంచులు నందగిరి నర్సయ్య, బాలుసాని పర్శరాములు, బీఎస్పీ నాయకులు తడుక భాను, మండలాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, జిల్లా నాయకులు లింగంపల్లి మధుకర్, వెంకన్న పాల్గొన్నారు.

నిరుద్యోగుల పోరాటానికి మద్దతివ్వండి

సిరిసిల్లటౌన్: రాష్ట్రంలోని నిరుద్యోగుల న్యాయ పోరాటానికి మద్దతు ఇవ్వాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్‌ను వైఎస్సార్‌టీపీ రాజన్నసిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము కోరారు. సిరిసిల్లలో శనివారం జరిగిన పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడానికి వచ్చిన ప్రవీణ్‌కుమార్‌ను వైఎస్సార్‌టీపీ నేతలు కలిసి మాట్లాడారు. రాష్ట్ర సర్కారు తీరుతో నష్టపోతున్న నిరుద్యోగులు, విద్యార్థులకు అండగా నిలవాలని కోరారు. వైఎస్సార్‌టీపీ నాయకులు కరుణాకర్, మహిపాల్, అనిల్ పాల్గొన్నారు.

ఇరువర్గాలు పరస్పరం ఫిర్యాదు

- మజీద్ కమిటీ అధ్యక్షుడి ఎన్నికపై సందిగ్ధత

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల ఇంతెజామి మజీద్ కమిటీ అధ్యక్ష పేదవిపై సందిగ్ధత నెలకొంది. ఒకరు నకిలీ మార్కులషీట్ పెట్టి ఎన్నికల్లో గెలిచారని పోలీసులకు ఫిర్యాదు చేయగా, మరోవర్గం ఒకసారి ఎన్నికైన అధ్యక్షుడిని తొలగించకుండా మరొకరిని నియమించడం సరికాదని ఎస్పీ అఖిల్ మహాజన్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. ఎండీ ముస్తాఫా మార్చి 12న నిర్వహించిన మజీద్ కమిటీ ఎన్నికల్లో అధ్యక్షుడిగా గెలుపొందారు. ఎన్నికల అధికారి ఎండీ వహిద్ ధ్రువీకరణపత్రం అందించారు. ముస్తాఫా దరఖాస్తులో చదువు ధ్రువీకరణపత్రం నకిలీది పెట్టినట్లు పలువురు సిరిసిల్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. అధ్యక్షుడిగా అతని ఎన్నిక చెల్లదని, నకిలీ సర్టిఫికెట్ పెట్టినందుకు చీటింగ్ కేసు పెట్టాలని కోరారు. ఇదిలా ఉండగానే అదే ఎన్నికల అధికారి సమక్షంలో ఎండీ సలీంను అధ్యక్షుడిగా పేర్కొంటూ శనివారం ధ్రువపత్రాలు అందించారు. అయితే తాను సర్టిఫికెట్ విషయమై కోర్టును ఆశ్రయించానని, దీనిపై స్పష్టత రాకుండానే అధ్యక్షుడిగా సలీంను ప్రకటించడం సరికాదని ముస్తాఫా పేర్కొన్నారు. ఇరువర్గాలలో కోపాలు పెరిగి శాంతి భద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉందని రక్షణ కల్పించాలని ముస్తాఫా ఎస్పీ అఖిల్ మహాజన్‌కు వినతిపత్రం అందించారు.

మద్యానికి బానిసై ఒకరి బలవన్మరణం

సిరిసిల్లక్రైం: మద్యానికి బానిసై, అనారోగ్య సమస్యతో బాధ పడుతున్న ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. సిరిసిల్లలోని గణేశనగర్‌కు చెందిన కోడం శివ(48) మరమగ్గాలు నడుపుకుంటూ జీవిస్తున్నాడు. చాలా కాలంగా మద్యానికి బానిసయ్యాడు. గత నాలుగేళ్లుగా కడుపునొప్పితో బాధ పడుతున్నాడు. ఇటీవల సమస్య తీవ్రమవడంతో సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొంది, మందులు వాడుతున్నాడు. అయినా ఆరోగ్య పరిస్థితి బాగు పడటం లేదని మనస్తాపానికి గురయ్యాడు. శనివారం ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కూలి పనికి వెళ్లిన అతని భార్య లావణ్య ఇంటికి వచ్చి చూడగా శివ మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ అనిల్‌కుమార్ తెలిపారు.



డూ హార్డ్ వర్క్.. ఆల్ ది బెస్ట్

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు శనివారం రాజన్నసిరిసిల్ల జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం సమీపంలోని జిల్లా గ్రంథాలయాన్ని సందర్శించారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగ అభ్యర్థులతోమాట్లాడారు. వారికి పలు సూచనలు చేశారు. డూ హార్డ్ వర్క్.. ఆల్ ది బెస్ట్.. కష్టపడి కోరుకున్న ఉద్యోగం సాధించాలని సూచించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్న సిరిసిల్ల

18 కేంద్రాలు.. 12,784 మంది హాజరు



తండ్రికి బ్యాగు అప్పగిస్తున్న అభ్యర్థిని



అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

- ప్రశాంతంగా ముగిసిన ఎస్ఐ మెయిన్స్
- కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు
- పరీక్ష సమయానికి ముందే కేంద్రాల్లోకి అనుమతి
- సెంటర్లను పరిశీలించిన సీపీ సుబ్బారాయుడు

కరీంనగర్‌క్రైం: పోలీస్ శాఖలోని వివిధ విభాగాల్లో స్టైఫండరీ క్యాడెట్ ట్రైనీ ఎస్ఐ(సివిల్/ఏఆర్/టీఎస్ఎస్పీ/ఎస్పీఎఫ్/ఎస్ఆర్ సీపీఎల్/ఫైర్) అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో భాగంగా రాత పరీక్ష శనివారం ప్రశాంతంగా ముగిసింది. ఎస్ఐ అభ్యర్థుల రాత పరీక్ష కోసం కరీంనగర్, తిమ్మాపూర్, నుస్తులాపూర్‌లో 18 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 వరకు పరీక్ష కొనసాగింది. సీపీ ఎల్.సుబ్బారాయుడు బందోబస్తు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. నగరంలోని లాడ్జిలను తనిఖీ చేశారు. అభ్యర్థుల వేలిముద్రలను బయోమెట్రిక్ విధానం ద్వారా పరిశీలించారు. పరీక్ష కేంద్రాల ప్రాంతాల్లో ఉన్న జిరాక్స్ సెంటర్లను పరీక్ష మూసివేయించారు. కాగా.. శనివారం జరిగిన పరీక్షకు 12,784 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 94.84 హాజరు శాతం నమోదైంది.

దుబాయ్‌లో గుండెపోటుతో వలసజీవి మృతి

- మృతుడు కోనరావుపేటవాసి



శ్రీనివాస్ (ఫైల్)

కోనరావుపేట(వేములవాడ): ఉన్న ఊరిలో ఉపాధి కరువై దుబాయ్ వెళ్లిన ఓ వలసజీవి, అక్కడే గుండెపోటుతో మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండల కేంద్రానికి చెందిన బొల్లె శ్రీనివాస్(47) పదేళ్లుగా దుబాయ్ వెళ్తున్నాడు. ఆరు నెలల క్రితమే ఇంటికి వచ్చి, మళ్లీ వెళ్లాడు. శనివారం ఉదయం ఫోన్ చేసి, కుటుంబసభ్యులతో మాట్లాడాడు. మధ్యాహ్నం డ్యూటీకి రాలేదని తోటి కార్మికుడు ఫోన్ చేయగా ఎత్తలేదు. గదికి వచ్చి చూడగా విగతజీవిగా పడి ఉన్నాడు. గుండెపోటుతో మృతి చెందినట్లు భావించి, కోనరావుపేటలోని కుటుంబసభ్యులకు తెలియజేశాడు. శ్రీనివాస్ మృతి విషయం తెలుసుకున్న కుటుంబీకులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. మృతుడికి భార్య శోభ, కుమారుడు జెస్విన్, కూతురు జాషువేరి ఉన్నారు. శ్రీనివాస్‌ది నిరుపేద కుటుంబమని, ప్రభుత్వం చొరవ తీసుకొని, మృతదేహాన్ని స్వగ్రామం రప్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రధాని మోదీ పర్యటనపై నిరసనలు



సిరిసిల్ల గాంధీచౌక్‌లో ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

సిరిసిల్లటౌన్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ శనివారం హైదరాబాద్ పర్యటన సందర్భంగా సిరిసిల్లలో ప్రతిపక్షాల నిరసనలు మిన్నంటాయి. స్థానిక తెలంగాణ చౌక్‌లో సీపీఐ ఆధ్వర్యంలో ప్రధాని దిష్టిబొమ్మ దహనం చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి గుంటి వేణు మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పాటు సందర్భంగా ఇచ్చిన హామీలను కేంద్రం అమలు చేయడం లేదని, సింగరేణిని ప్రైవేటుపరం చేయడానికి టెండర్లు వేయడం శోచనీయమన్నారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఎందుకు ఏర్పాటు చేయడం లేదని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తెలంగాణ గడ్డపై అడుగుపెట్టే హక్కు ప్రధానికి లేదన్నారు. నాయకులు పంతం రవి, రాములు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో..

బీజేపీకి కేంద్రంలో అధికారంలో కొనసాగే అర్హత లేదని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీశ్ అన్నారు. సిరిసిల్లలోని గాంధీచౌక్‌లో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేసి, మాట్లాడారు. రాష్ట్ర విభజన చట్టంలో ట్రైబల్ యూనివర్సిటీ, ఐటీఐఆర్ ప్రాజెక్టు, మెడికల్ కాలేజీ, నవోదయ విద్యా సంస్థల్లో రాష్ట్రానికి ఏ ఒక్కటీ ఇవ్వలేదని మండిపడ్డారు. సింగరేణిని ప్రైవేటుపరం చేస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. నాయకులు మానాల అరుణ్, ఎస్కే.బాబా, కొత్త సంతోష్‌గౌడ్, షేక్ సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి ఇచ్చిందేమీ లేదు..

వేములవాడఅర్బన్: కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రానికి ఇచ్చిందేమీ లేదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కడారి రాములు ఆరోపించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాష్ట్ర పర్యటనను నిరసిస్తూ శనివారం వేములవాడ పట్టణంలో ఆయన దిష్టిబొమ్మ దహనం చేశారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తున్నారని మండిపడ్డారు. కార్మికులను రోడ్డున పడేసేలా వ్యవహరిస్తున్నారని తెలిపారు. నాయకులు క్రాంతి, కోరెపు శ్రీనివాస్, గాజుల శ్రీనివాస్ తదితరులున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
ADMISSIONS

■Admissions for Guidence GNM B.Sc, M.Sc Nursing, B.Pharm, BPT, MPT, BAMS, BHMS, Few Seats Available. Cell: 7013038197, 8367566346, Hyd. [W-785511]

SERVICES
RENT / LEASE

■వేములవాడ మేన్ రోడ్డుకి కోరుట్ల బస్టాండ్ దగ్గర 4 ఫ్లోర్‌లు గల బిల్డింగ్ రెండు వైపుల రోడ్డుతో కూడిన బిల్డింగ్ హాస్పిటల్స్, కాలేజీలకు మరియు కమర్షియల్‌కి, షాపింగ్ మాల్స్‌కి అనుకూలం. లిఫ్ట్ సౌకర్యంకలదు. 9177662885, 9391740520 [K-1219805]

WANTED

■మ్యాన్ పవర్ & సెక్యూరిటీ ఫీల్డ్‌లో అనుభవమున్న ఫీల్డ్ ఆఫీసర్స్ కావలెను. Contact : Mega Group Man Power & Security. Cell : 70326 10569, 70931 25169. [NA-5483]

■ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-785707]

■Digital Marketing కొరకు Marketing Executives కావలెను సంప్రదించండి. ఫోన్ : 9959484341 [H-778982]

■కాంట్రాక్టు పద్ధతి లో హాస్పిటల్ లో వర్క్ చేయడానికి M/F స్టాఫ్ నర్స్, జూ. డాక్టర్స్, ల్యాబ్ టెక్నీషియన్స్ అ.కా.ను. Sal: 23K-37K ఇంట్రెస్టెడ్ ఉన్నవారు రెజ్యూమ్ వాట్సాప్ చేయగలరు. ఫోన్: 6281159171 [HA-29125]

■HYDలో అర్జంటుగా సెక్యూరిటీ గార్డ్స్, RTC కార్గో బస్‌లకు బాయ్స్, అటెండర్స్ కావలెను. (కన్సల్టెన్సీ కాదు) మంచి జీతం; వసతి కలదు. సంప్ర: 040-66666664, 9392663777, 9246663777 [HA-1330]

■గుంటూరు దగ్గర గల ఆఫీసులో ఉండి పనిచేయుటకు టైపింగ్, డ్రైవింగ్ తెలిసిన జూనియర్ లాయర్స్ మరియు డ్రైవర్స్ కావలెను. సంప్రదించండి. ✆ 9666114383/7207007725 [G-779538]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933, 9951602824